# సింగిల్ పేజి కథలు

## బిచ్చగాళ్ల సినిమా

ఇంతకు ముందు భారీ బడ్జెట్ ఫిల్మ్ తీస్తే- అది కాస్తా అట్టర్ ఫ్లాపై- నష్టం కూడా భారీగానే వచ్చినందున... ఈసారి లోబడ్జెట్ ఫిల్మ్ తియ్యాలని నిశ్చయించుకున్నాడు నిర్మాత నిరంజన్‌రావు.

అయితే దర్శకుడ్ని మార్చేందుకు లేదు. ఇంతకు ముందు భారీ బడ్జెట్ ఫిల్మ్ తీసిన... అంటే డైరెక్ట్ చేసిన దర్శకసింహ దుబారారావ్‌నే ఇప్పుడూ పెట్టుకోవాలి. ఆమేరకు వాళ్లిద్దరి మధ్యా ఓ అగ్రిమెంట్ ఉంది. పేపర్ల మీద రాసుకుని సంతకాలు చేసిన ఒప్పందం.. సో.. దాన్ని మీరటానికి లేదు-తప్పదు.

దుబారారావ్ సహజంగానే భారీ సెట్టింగులూ అవీ



వెయ్యించి ఒకింత దుబారాగానే ఖర్చు పెట్టిస్తుంటాడు- తన నిర్మాతల చేత. అంచేత దుబారా ఖర్చుని పర్మిట్ చేసుకోవాల్సిన అవసరం లేని కథని ఎన్నుకుంటే మంచిదనిపించింది నిరంజన్‌రావుకి.

ఈ విషయం గురించి అతను రచయిత పీనాసిరావ్‌ని అప్రోచ్ అయ్యాడు. వివరించాడు తనకు ఎలాంటి కథ కావాలో-

"ఎక్కువ ఖర్చు చెయ్యడానికి అవకాశమే లేని కథ కావాలి మీకు అంతేగా.." అని నవ్వి.. "అలాంటి కథ నా దగ్గర ఒకటి రెడీగా ఉంది" అన్నాడు పీనాసిరావ్.

"చెప్పండి.. చెప్పండి.." ఉత్సాహంగా అన్నాడు నిరంజన్‌రావ్.. కొంచెం ముందుకు వంగి.

"పేరు.. సూపర్ బిచ్చగాడు..."

"బాగుంది.. బాగుంది.. అయితే హీరో బిచ్చగాడన్నమాట"

"అవును... కథాపరంగా హీరో బిచ్చగాడు గనక- అతనికి కాస్ట్యూమ్స్ ఖర్చే ఉండదు.. గోచీ చాలు.."

"మరి హీరోయిన్?"

"తను కూడా ఓ బిచ్చగత్తే.. సో.. తనక్కూడా చింకిపాతలు చాలు.. సరిపోతాయ్.."

"వెరీగుడ్.. బాంది.. బాంది.. వాళ్లు నివసించేది ఎక్కడ? ఐమీన్ హీరోహీరోయిన్లు?" పీనాసిరావు అందించబోతున్న మాంఛి కథకి మనసులో మురిసిపోతూ మరింత ఉత్సాహంగా అడిగాడు నిరంజన్‌రావు.

"ఇంకెక్కడా? మీ ఇంటి వెనక గుడిసెలు ఉన్నాయ్‌గా.. అక్కడ లాగించేద్దాం.."

"పైకప్పులేని ఇల్లయితే.., ఐమీన్ గుడిసె అయితే ఇంకా మంచిది.."

"అమ్మో.. కథలోకి వచ్చేశారే.." పీనాసిరావ్ నిరంజన్‌రావ్‌ని ఉత్సాహపరిచాడు.

"ఆ ఏరియాలోనే పందుల మధ్య ఫైటింగులూ, గట్రా పెట్టుకోవచ్చన్నమాట.. వాటెబవుట్ లవ్‌ట్రాక్?"

"షరా మామూలుగా హీరో హీరోయిన్లు ప్రేమించుకుంటూ ఉంటారు. డ్రీమ్‌సాంగులూ ఉంటాయ్..కానైతే బిచ్చగాళ్లకి ఖరీదైన కలలు రావు కాబట్టి వాట్ని కూడా-నవాబ్ పేటలోని రైతుబజార్ నుండి తీసుకొచ్చిన వ్యర్థపదార్థాలతో- కుళ్లిన టొమాటాలతో ఫినిష్ చేసేయొచ్చు..."

పీనాసిరావ్ అలా చెబుతుంటే ఆనందంతో ఎగిరి గంతులెయ్యాలనిపించింది నిరంజన్‌రావుకి.

ఖర్చు ఎంత తగ్గితే అంత మంచిది.

అతనిక్కావలసింది అదేగా!

"సూపర్‌గా ఉంది కథ.." అని మెచ్చుకుని - క్షణం తర్వాత అడిగాడు. "మరి కామెడీ, ట్రాకో..."

"సినిమా అన్నాక కామెడీ ట్రాక్ లేకుండా ఎలా అదీ ఉంటుంది.. కానీ, కమెడియన్లు కూడా బిచ్చగాళ్లు.. సో.. వాళ్ల విషయంలో కూడా పెద్ద ఖర్చేంతో ఉండదు. వాళ్లు కూడా గోచీలూ, చింకిపాతలే ధరిస్తారు. వీపున గోనె సంచులుంచుకుని- బజార్లలో చెత్త, చెదారం ఏరుకుంటూ ఉంటారు. చెత్తకుండీల దగ్గర కామెడీ పెట్టేద్దాం.. ఇకపోతే మెయిన్ కథ ఏమిటంటే.." అంటూ కథలోకి వెళ్లబోయాడు పీనాసిరావు.

కానీ, నిరంజన్‌రావు అతన్ని వారించాడు.

"నాకింకేం చెప్పొద్దు. పాత్రల తీరుతెన్నులు నాకు చాలా బాగా నచ్చాయ్. కథ ఎలా ఉన్నా పర్లేదు. ఆ చెప్పేదేదో నేరుగా డైరెక్టర్ దగ్గరే చెబుదురుగాని పదండి..." అన్నాడు అమితుత్సాహంగా.

రెండుసార్లు చెప్పే బాధ తప్పింది కదాని-

"సరే సరే-" అన్నాడు పీనాసిరావ్ కూడా ఉత్సాహంగా.

దరిమిలా వాళ్లిద్దరూ కలిసి దర్శకసింహ దుబారారావ్ దగ్గరికెళ్లారు.

అక్కడ పీనాసిరావు కథంతా వినిపించగానే-

"చాలా బాగుంది. నవరసాలూ ఉన్నాయి. కానైతే నేను కొన్ని చిన్న చిన్న మార్పులు చేసుకుంటాను. దానికి మీరిద్దరూ అంగీకరించాలి.." అన్నాడు దుబారారావ్ ఆకాశం వంక చూస్తూ-

"భలేవారే.. చిన్న చిన్న మార్పులు చేసుకునే స్వేచ్ఛ, దర్శకుడిగా మీకెప్పుడూ ఉంటుంది. అలాగే కానివ్వండి.." అన్నాడు నిరంజన్‌రావు-దర్శకుడికి కూడా కథ నచ్చినందుకు తెగబారెడు సంతోషపడిపోతూ.

"ఇంతకీ షూటింగ్ ఎప్పుడు పెట్టుకుందాం?" అడిగాడు దుబారారావు.

"నెక్స్ట్ మంత్ పెట్టుకుందాం.. సినిమా సింగిల్ షెడ్యూల్‌లో పూర్తయిపోవాలి" అన్నాడు నిరంజన్‌రావు.

"అలాగే.. ఆర్టిస్ట్‌లూ.. యూనిట్ సభ్యులందరికీ ఫ్లైట్ టిక్కెట్లూ గట్రా ముందుగానే రిజర్వ్ చేయించండి మరి" అన్నాడు దర్శక సింహ.

"ఫ్లైట్ టిక్కెట్లా? ఎక్కడికీ?" గాబరాగా అడిగాడు నిరంజన్‌రావు.

"అమెరికాకి- మన కథలోని బిచ్చగాళ్లందరూ అమెరికాలో అడుక్కుంటున్నట్టుగా తీద్దాం.. రిచ్‌గా ఉంటుంది" చెప్పాడు దర్శకసింహ దుబారారావు.

-కె.లక్ష్మీకాంతమ్మ (నెల్లూరు)